నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలి

రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - చిన్నమండెం

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం మండలంలోని బోరెడ్డి గారిపల్లెలోని తమ నివాసంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత చ్చి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. అప్పుడే అధికారులపై నమ్మకం ఏర్పడుతుందని చెప్పారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగా ప్రజలు తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బాధితుల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించి వారికి న్యాయం చేస్తుందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ఒక్కరు కూడా సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ముందుకు వెళ్తున్నామని, అధికారులందరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి వారికి న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల అర్జీలు స్వీకరించి వారి సమస్యలలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు.

నియోజకవర్గంలో గ్రామీణ రహదారులకు మహర్దశ

రాయచోటి : రాయచోటి నియోజకవర్గంలో గ్రామీణ రహదారులకు మహర్దశ రానున్నాయని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రూ.12.06 కోట్లతో రాయచోటి నియోజకవర్గంలో వివిధ గ్రామాలలో పాడైపోయిన వివిధ రహదారుల నిర్మాణాలను వెంటనే చేపట్టాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారికి ఆదేశించామని చెప్పారు. ఇందులో భాగంగా చిన్నమండెం మండలంలో రాయచోటి - మదనపల్లి రహదారి నుండి సద్దలగుట్టపల్లికి 01 కిలోమీటర్ రహదారి, చిన్నమండెం మండలంలో రాయచోటి-మదనపల్లి రహదారి నుండి రెడ్డివారి పల్లికి 1.5 కిలోమీటర్ల రహదారి, రాయచోటి మండలంలో మాధవరం నుండి మధ్య వాండ్లపల్లి కి 3.5 కిలోమీటర్ల రహదారి, రాయచోటి మండలంలో మాసాపేట - కాటిమాయకుంట రహదారి నుండి అడ్డు వాండ్లపల్లికి 1.91 కిలోమీటర్ల రహదారి పనులను ప్రారంభించామని చెప్పారు. గాలివీడు మండలంలో ఆర్వే రోడ్డు నుండి గోపనపల్లి మీదుగా కేజీ రోడ్డుకు 4.51 కిలోమీటర్ల రహదారి, లక్కిరెడ్డిపల్లి మండలంలో ఆర్వి రోడ్డు నుండి ఎడిగపల్లి వరకు 3.41 కిలోమీటర్ల రహదారి, రామాపురం మండలంలో ఆర్వీ రోడ్డు నుండి ఏకిలపల్లి కి 01 కిలోమీటర్ రహదారి, సంబేపల్లి మండలంలో సి కె రోడ్డు నుండి దిన్నేపల్లికి 2.8 కిలోమీటర్ల రహదారి పనులు చేపడుతామని తెలిపారు.గామీణ రహదారుల నిర్మాణంతో గ్రామాలలోని రైతులకు ఎంతో లబ్ధి చేకూరనుందని అన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం

ఎల్ఐసి ఉద్యోగుల సంఘం జోనల్ సంయుక్త కార్యదర్శి తిరుపతయ్య

- మాట్లాడుతున్న జోనల్ సంయుక్త కార్యదర్శి తిరుపతయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకురానున్న లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కోసం, అందరికీ పాత పెన్షన్ పథకం అమలు చేయాలని కోరుతూ ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య పిలుపునిచ్చారు. ఆదివారం బ్రాంచ్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాలు, ఎఐఐఇఎ లాంటి స్వతంత్ర కార్మిక సంఘాలు, బ్యాంకింగ్ యూనియన్లు ఇచ్చిన పిలుపు మేరకు కొట్లాదిమందితో సమ్మె ఉంటుందని తెలిపారు. వందశాతం ఎఫ్‌డిఐ పేరుతో దేశంలోకి విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీలను అనుమతించబోతున్నారని పేర్కొన్నారు. ఇదే జరిగితే, జాతీయకరణకు ముందునాటి అక్రమాలు మళ్లీ పునరావృతం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల ఆందోళనలకు తలఒగ్గి పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేస్తున్నాయని తెలిపారు. ఇదే పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం, రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్లు విపరీతంగా పెరిగిపోయి పని భారం పెరుగుతోందని, తక్షణమే నూతన నియామకాలు చేపట్టాలని కోరారు. ఎల్ఐసి ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, బ్యాంకింగ్ యూనియన్ల నాయకులు లలిత, అజీజ్, జగదీశ్వర్ రెడ్డి, మెడికల్ రెప్స్ యూనియన్ కార్యదర్శి రామానుజుల రెడ్డి, అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కంభం చెన్నయ్య, ఈపీఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, ఎల్ఐసి క్లాస్ 1 అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రపాల్, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి సుధీకర్ సమ్మెకు సంఘీభావం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎల్ఐసి యూనియన్ నాయకులు అక్బర్ బాషా, వసుప్రద, వారిజాతమ్మ, కె సి ఎస్ రాజు, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

11న 'మిట్స్'లో ఇఎపిసెట్ మోడల్ పరీక్ష

పోస్టర్లను ఆవిష్కరణ చేస్తున్న కరస్పాండెంట్ విజయభాస్కర్ చౌదరి

ప్రజాశక్తి-మదనపల్లె

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే ఇఎపిసెట్-2025 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల కోసం మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉచిత మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ పేర్కొన్నారు. ఈ పరీక్ష రెండు విడతలుగా ఆన్‌లైన్‌లో నిర్వహించ నున్నట్లు తెలిపరు. ఆదివారం కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్. విజయ భాస్కర్‌చౌదరి పరీక్షకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యా ర్థులు ఈ మోడల్ పరీక్ష ద్వారా అసలైన ఇఎపిసెట్ పరీక్ష తీరును అవగతం చేసుకోవచ్చని, సరిగ్గా ఏ సమయానికి, ఏ విధంగా పరీక్షను రాయాలో ముందుగా ప్రాక్టీస్ చేసే అవకాశం కలుగుతుందని అన్నారు. ఈ మోడల్ పరీక్ష మే 11న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు మొదటి విడతగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో విడతగా మిట్స్ కళాశాల కంప్యూటర్ ల్యాబ్‌లలో నిర్వహించబడుతుందని అన్నారు. ఇంజనీరింగ్ ప్రవేశానికి సిద్ధమవుతున్న ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థులకే పరిమితమని చెప్పారు. పరీక్షకు సంబంధించిన వివరాలను కళాశాల అధికారిక వెబ్‌సైట్ www.mits.ac.inలో పొందుపరిచినట్లు తెలిపారు. 8712655132 నంబర్‌కు ఫోన్ చేసి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆర్ఆర్ఆర్ ఎడ్యుకేషన్ అకాడమీ అధ్యక్షుడు నాదెళ్ల ద్వారకానాథ్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిణి ప్రతిభ, సీనియర్ కమ్యూనికేషన్ మేనేజర్ మారుతీ ప్రసాద్, ఎంసిఎ విభాగాధిపతి డాక్టర్ నవీన్‌కుమార్, వ్యవసాయ విభాగ అధికారి వెంకటేశ్వర్‌బాబు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించాలి : మంత్రి

ప్రజాశక్తి - రాయచోటి : జిల్లాలో పలు రెవెన్యూ సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పిస్తుంటారని రెవెన్యూ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో మంత్రి పలు రెవెన్యూ సమస్యలపై ఆర్‌డిఒ శ్రీనివాస్‌తో చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ప్రజలు రెవెన్యూ సమస్యలతో నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారిని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తుందని చెప్పారు. రాయచోటి నియోజకవర్గంలో ఎటువంటి రెవెన్యూ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆర్‌డిఒకు సూచించారు. రాబోయే రోజులలో ఏ ఒక్కరూ రెవెన్యూ సమస్యలతోబాధపడ కూడదని తెలిపారు.

తొలి తెలుగు ముస్లింవాద రచయిత సత్యాగ్ని

ప్రజాశక్తి - కడప అర్బన్ : తొలి తెలుగు ముస్లిం వాద రచయితగా షేక్. హుస్సేన్ సత్యాగ్ని తెలుగు సాహితీ లోకంలో చిరస్మరణీయమైన స్థానాన్ని ఆక్రమించారని వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. ఆదివారం కడప జిల్లా రచయితల సంఘం వారు రచయితల సంఘానికి గౌరవాధ్యక్షులుగా ఉన్న సత్యాగ్నిని వారి స్వగృహంలో కలిసి ఆయన యోగక్షేమాలు విచారించి, ఆయన చేసిన సాహిత్య కృషిని కొనియాడుతూ సత్యాగ్ని దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ముస్లిముల జీవిత విధానాన్ని పరిశీలించి సమగ్రమైన అవగాహనతో ఆయన కథలు రాశారని, అలా ముసిముల జీవితాల గురించి మొట్టమొదటిసారిగా కథలు రాసిన ఖ్యాతి సత్యాగ్నికే దక్కుతుందన్నారు. ఉపాధ్యక్షులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ ముస్లిం స్త్రీల సమస్యలను మొదటిసారిగా ప్రపంచానికి చాటి చెప్పిన సంస్కరణవాదన్నారు. కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి ప్రసంగిస్తూ ముస్లిం జీవితాల అంతర్గత సమస్యలకు అక్షర రూపాన్ని ఇచ్చిన షేక్ హుస్సేన్ కథా విప్లవకారుడన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె

స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఆదివారం ఎపి ఎన్‌జిఒ, పెన్షనర్స్ సం ఘం ఆధ్వర్యంలో స్థానిక రమా నేత్రాలయ డాక్టర్ మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు నరసిం హారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించిందన్నారు. ప్రతి ఉద్యోగి మూడు నెలలకు ఒక సారి కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకుని కంటిని ఆరోగ్యంగా చూసు కోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో కంటి డాక్టర్ మహేష్ రెడ్డి మాట్లాడుతూ కంటికి సంబంధించిన సమస్యల గురించి అవగాహన కల్పించడం జరిగిం దన్నారు. ఈ వైద్య శిబిరములో 65 మంది ఉద్యోగస్తులుకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలపారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ కార్యదర్శి రెడ్డిశేఖర్, అసోసి యేట్ అధ్యక్షులు గిరిధర్‌రెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నరసిం హులు, కార్యదర్శి వెంకట రమణ, కార్యవర్గ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్య చికిత్సలు చేస్తున్న డాక్టర్ మహేష్‌రెడ్డి

అన్ని గ్రామాలకు రోడ్ల కల్పనే లక్ష్యం

జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి దయాకర్‌రెడ్డి

ముఖా ముఖి..

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో అందరికి అందుబాటులో ఉండి అన్ని గ్రామాలకు సిమెంట్ రోడ్లు వేయించడమే తమ లక్ష్యమని జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు, భవనాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ ఏడాదిలో జిల్లాకు ఎంత బడ్జెట్ ఎంత మంజురు అయినదో, ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి పనులు గురించి ప్రజాశకి కి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

జిల్లాలో పంచాయితీ రాజ్ కార్యాలయాల వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో జిల్లా పంచాయతీ రాజ్ కార్యాలయం ఉంది. దీంతో పాటు పంచాయితీరాజ్ డివిజన్ ఇంజినీరింగ్ కార్యాలయాలు మూడు ఉన్నాయి. రాయచోటి, రాజంపేట, మదనపల్లి ప్రాంతాలలో ఉన్నాయి. మదనపల్లిలో డివిజన్ సంబంధించి 5 సబ్ డివిజన్లు (మదనపల్లిలోరెండు, తంబళ్లపల్లి, పీలేరు, వాల్మీకి పురం), రాజంపేట డివిజన్‌కు సంబంధించి 3 సబ్ డివిజన్లు (రాజంపేటలో రెండు, కోడూరు ఒకటి) రాయచోటి డివిజన్ సంబంధించి 2 సబ్‌డివిజన్లు(రాయచోటి, లక్కిరెడ్డిపల్లి) లో కార్యాలయాలున్నాయి.

జిల్లాకు ఈ ఏడాది ఎంత బడ్జెట్ మంజూరైంది?

ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం కింద 2025-26 సంవత్సరానికి గాను రూ. 60 కోట్లు మంజూరు కోసం ప్రతి పాదనలకు అంచనాలు వేశాం.

ప్రస్తుతం చేపడుతున్న పనుల వివరాలు తెలపండి?

ఎంజిఎన్‌ఆర్‌జిఎస్ పథకం కింద పల్లె పండుగ పనులు, డిఎంఎఫ్ పథకం కింద సిమెంట్ రోడ్లు, పిఎం జిఎస్‌వై పథకం కింద బిటి రోడ్లు ప్రస్తుతం చేపడుతున్నాం.

పనులు ఎంతవరకు చేశారు?

ఎంజిఎన్‌ఆర్‌జిఎస్ పథకం కింద 13,61 పనుల గాను 11,81 2024-25 సంవత్సరంలో పూర్తయి ్‌నాయి. డిఎంఎఫ్ పథకం కింద 3 పనులగాను రూ.5 లక్షలతో ప్రహరీ నిర్మాణాలు లక్కిరెడ్డిపల్లిలో పూర్త య్యాయి. అదేవిధంగా సిమెంట్ రోడ్డు నిర్మాణం కోసం రూ .180.00 లక్షలతో చిన్నమండెం మండ లంలో 2024-25 సంవత్సరంలో పూర్తియినవి.

బిల్లులు సకాలంలో అందుతున్నాయి?

పల్లె పండుగ పనులకు గాను బిల్లులు సకాలంలో అందుతున్నాయి.

బిల్లులు చెల్లించాలింటే డబ్బులు ఇవ్వాల్సిందేనా?

ఎవరికి ఒక రూపాయి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరైనా డబ్బులు తీసుకున్నట్లు తెలిస్తే వారిపై తగు చర్యకు సిఫార్సు చేస్తాము.

సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

మండల ఇంజినీరింగ్ అధికారుల కొరత ఉంది. వారి స్థానములో సచివాలయ ఇంజినీర్లతో పనులు చేయించుకుంటున్నాం.

ప్రజలకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

ప్రస్తుతం గ్రామాలలో పనులు నాణ్యతాపరంగా జరు గుతున్నాయి. ప్రజలు పరిశీలించి ఏవైనా లోటు పాట్లు ఉంటే కార్యాలయానికి వచ్చి తెలపాలి.

పండు ఈగ నివారణకు తగిన చర్యలు చేపట్టాలి

-జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు

మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు

ప్రజాశక్తి-పీలేరు

మామిడి సాగులో పండు ఈగ నివారణకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్ర బాబు తెలిపారు. ఆదివారం మండంలోని తలుపులలో అన్నమయ్య రైతు సంఘం ఆధ్వర్యంలో మామిడి అమ్మకపు దారులు, కొనుగోలుదరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధికారి మాట్లాడుతూ ఇప్పుడు మామిడిని ఆశించే పండు ఈగ నివారణకు మిథైల్ యూజీనాల్ కలిగిన లింగాకర్షక బుట్టలను భూమి నుండి 5-6 అడుగుల ఎత్తులో ఎకరానికి 5-6 అమర్చుకోవాలని తెలిపారు. పంటకోత సమయానికి మూడు వారాల ముందు, డెల్టామెత్రిన్-0.5మి. లీంఅజాడిరెక్టిన్ (3000పి.పి.యమ్)-2 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చెయ్యాలన్నారు. లేదంటే లీటర్ నీటికి 100 గ్రాముల బెల్లం 2మిల్లీ లీటర్లు డెల్టామిత్రిన్ కలిపి విషపు ఎర తయారీ చేసి పొలంలో అక్కడక్కడ అమర్చాలని చెప్పారు. మామిడికాయలు, నిమ్మకాయ దశలో ఉన్నప్పటి నుంచి కాయలకి టేబుల్ వెరైటీలకి ఫ్రూట్ కవర్స్ వాడటం వలన పండు ఈగ ,కాయ తొలుచు పురుగు, తామర పురుగుల నుండి కాయల్ని రక్షింపబడుటయే కాక పురుగుమందుల వాడకం కూడా తగ్గించుకోవచ్చని అన్నారు. పురుగు మందుల అవశేషాలు లేని ఉత్పత్తులను పొందవచ్చని తెలిపారు. కాయ రంగు, నాణ్యత, పరిమాణం పెరగడమే కాక ఎండ తాకిడి నుంచి పండ్లను కాపాడుకోవచ్చని తెలిపారు. మార్కెట్‌లో కూడా ఇలాంటి పండ్లకు మంచి ధర లభిస్తుందని తెలిపారు. పంట కోతకు ఒక నెల ముందు నీటి తడులను ఆపుట ద్వారా కాయలో చక్కర శాతం, తీపిదనం పెరగడమే కాక నిల్వ సామర్థ్యం పెరిగి దూరప్రాంత రవాణాకు అనుకూలంగా ఉంటుందని సూచించారు. గ్లోబల్ ఫ్యాక్టరీ ప్రతినిధి చంద్రమౌళి మాట్లాడుతూకాయలను ఒకే మారు కాకుండా దశలవారీగా పక్వానికి వచ్చిన కాయల్ని కోయాలని, తద్వారా కాయ నిల్వ సామర్థ్యం పెరిగి దూరప్రాంత రవాణాకి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఆదివారం నుంచి అన్ని రకాల మామిడి కొనుగోలు సంఘ ద్వారా నిర్వహిస్తామని మంచి ధర ఇస్తామని సంఘ చైర్మన్ జయబ్బనాయుడు రైతులకు తెలిపారు.కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి సుకుమార్ రెడ్డి, జిల్లా విజిలన్స్ మానిటరింగ్ సభ్యులు బోధిషావలి, ఆర్.ఎస్.కె సిబ్బంది జహీర్, మామిడి రైతులు పాల్గొన్నారు.

ప్రధాని ఇచ్చిన హామీ నెరవేర్చాలి

మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు హరిబాబు

ప్రజాశక్తి-మదనపల్లె

ప్రధాని నరేంద్రమోదీ 2019లో కర్నూలులో జరిగిన బహిరంగ సభలో ఆంధ్రప్రదేశ్‌లోని వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చుతామని ఇచ్చిన ఇచ్చిన హామీని నెరవేర్చాలని రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూలకుంట్ల హరిబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వాల్మీకి సంఘం పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని ప్రారంభించింది. వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం సభ్యులు పూజలు చేసి ప్రధాని మోడీకి మంచి బుద్ధి కలగాలని, వాల్మీకుల దీర్ఘకాలిక డిమాండ్ నెరవేరాలని అన్నారు. 2019లో ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ, ప్రతి వాల్మీకి ఈ పోస్ట్‌కార్డు ఉద్యమంలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. గత వైసిపి ప్రభుత్వం వాల్మీకులకు చేసిన మోసాన్ని గుర్తుచేస్తూ, ఆంధ్రప్రదేశ్‌లోని వాల్మీకులు, బోయాలను ఎస్‌సి జాబితాలో పునరుద్ధరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ రాష్ట్ర అధ్యక్షు డు మేకల విజయ్‌మోహన్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు టేకుపల్లి శ్రీనివా సులు, రాయలసీమ ప్రధాన కార్యదర్శి మంచు గురుమూర్తి పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల భర్తీలో ప్రాధాన్యత ఇవ్వాలి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జె వెంకటేష్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పార్టీ కోసం కష్టపడి, బలోపేతం కోసం చేసిన కృషిని వారిని గుర్తించి నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఎపిఎస్‌పిడిసిఎల్ లీగల్ సెల్ ప్రతినిధిగా జి.దినేష్ కుమార్‌రెడ్డి, వినియోగదారుల ఫోరంలో వి.ఎస్.రెడ్డిలను నియమించడాన్ని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది సమీపిస్తున్న టిడిపిలో నిజమైన కార్యకర్తలకు ఎప్పుడు న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. సిఎం చంద్రబాబునాయుడుపైన అంగళ్లలో వైసిపి వారు చేసిన దాడి కేసులలో అప్పటి అడ్వకేట్ జనరల్ పోన్నవోలు సుధాకర్‌రెడ్డితో కలిసి మదనపల్లె లీగల్ టీంలో వున్న జి.దినేష్ కుమార్ రెడ్డికి ఎవరు రెకమెండ్ చేసి పదవి ఇచ్చారని అన్నారు. ఇలా వైసిపి కోసం పని చేసిన వారికి నియమించడం సబబు కాదని అన్నారు. మరోవైపు వైసిపి మేధావుల ఫోరం పదవిలో ఉన్న విఎస్.రెడ్డికి వినియోగదారుల ఫోరం పదవి ఎవరు ఇచ్చారని నిలదీశారు. పార్టీ పదవుల కోసం చకోర పక్షులు వలె ఎదురు చూస్తున్న నిఖార్సయినా టిడిపి నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేయడం మాని కోవర్టుకు పదవులు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. నియోజకవర్గంలో అక్రమ కేసులలో సుమారు 40 మంది కార్యకర్తలు, నాయకులు నిత్యం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి రాత్రి, పగలు కష్టపడిన వారికి పదవులు కేటాయించకపోగా, మంత్రులు, ఎమ్మెల్యేలు వైసిపి కోవర్టులకు పదవులు ఇస్తే పార్టీ కోసం ప్రాణాలు అడ్డుపెట్టి నిలబడే నిజమైన కార్యకర్తలు వచ్చే ఎన్నికలలో పార్టీ కోసం ఎలా పని చేస్తారని ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వంలో ఐదేళ్ల అక్రమ కేసులతో జైలు పాలైన వారిని పట్టించుకోకుండా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం కేసుల నుంచి విముక్తి కలిగించలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను వీలైనంత త్వరగా నామినేటెడ్ పదవుల్లో నియమించి గౌరవించాలని సిఎం చంద్రబాబు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు రాటకొండ మధుబాబు, రాజంపేట పార్లమెంటు కార్యాలయం కార్యదర్శి పూల మురళి, గ్రామ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున, మాజీ సర్పంచ్ రాజన్న, లక్ష్మన్న, టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి గండికోట గణేష్ పాల్గొన్నారు.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-మదనపల్లె

జనసేన పార్టీ మహిళా నాయకురాలు జయ భవ్య కిషోర్ ఆధ్వర్యంలో మదనపల్లి పుంగనూరు బైపాస్ కొండమారిపల్లి సర్కిలలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై ఫోర్స్ మహేష్ మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే సంవత్సరంలో లోపు స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి రాజం పేట పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పంచాయతీల్లో మండ లాల్లో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు కష్టపడి స్థానిక సంస్థల్లో జనసేన పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కొండామరపల్లి గ్రామ జనసేన పార్టీ నాయకులు కార్యకర్తల ను అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులకు అందుబాటులో లేని రేషన్ పంపిణీ

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని 31 చౌక దుకాణాలు ఉండగా అందులో మండలం ఏడు ఎండియు వాహనాల ద్వారా ఇంటింటి దగ్గరకు బియ్యం పంపిణీ జరిగేది. గత కొంతకాలంగా బియ్యం పంపిణీ చేసే రెండు వాహనాలు నిలిచిపోవడంతో ఆయా పరిధిలోని గ్రామాల ప్రజలు పాత పద్ధతిలోనే చౌక దుకాణం దగ్గరకు వెళ్లి నిత్యవసర సరుకులు పొందుతున్నారు. ఈ ప్రక్రియ వృద్ధులకు చాలా ఇబ్బందికరంగా మారింది. బయోమెట్రిక్ లేనిదే బియ్యం పంపిణీ చేయకపోవడంతో వృద్ధులకు వేలు ముద్రలు పడక అవస్థలు పడుతున్నారు. ఒక్కరే రేషన్ కార్డులో ఉన్న వృద్ధులు, నడవలేని వారు రేషన్ షాప్ దగ్గరికి వెళ్లలేక అష్టకష్టాలు పడుతున్నారు. ఇలాంటి సమస్యలు మండలంలో చాలా సంఖ్యలో ఉన్నాయి. చౌక దుకాణం పరిధిలోని వికలాంగులు వేలిముద్రలు పడక, నడవలేని వృద్ధులకు రేషన్ పంపిణీలో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో వృద్ధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యం వేలిముద్రల ద్వారా తీసుకోకపోతే ఆరోగ్య, వృద్ధాప్య పెన్షన్ విషయంలో ఏదైనా రద్దయ్యే అవకాశం ఉందేమోనని ఆందోళనకు గురవుతున్నారు. మండల అధికారులు చొరవ తీసుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేసే సరుకులను వేలిముద్రలు పడని వృద్ధులకు ప్రత్యామ్నాయం ఆలోచించి రేషన్ బియ్యం అందేలా కృషి చేయాలని కోరుతున్నారు.

రేషన్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- హైకోర్టు జడ్జిని కోరిన నందలూరు బార్ అసోసియేషన్

ప్రజాశక్తి-నందలూరు

కడప నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో హైకోర్టు న్యాయమూర్తి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లుని మర్యాదపూర్వకంగా కలిసి నందలూరు కోర్టు నూతన భవన నిర్మాణం విషయమై చర్చించి, కోర్టులో జడ్జిని నియమించమని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి నరసింహులు ఆదివారం వినతి పత్రం అందించారు. హైకోర్టు న్యాయమూర్తి సానుకూలంగా స్పందించి సత్వరమే సమస్యల ను పరిష్కరిస్తారని కృషి చేస్తానని హామీనిచ్చారని అన్నారు. అనంతరం హైకోర్టు జడ్జిని శాలువాతో ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గొబ్బిళ్ళ సుబ్బరామయ్య, జాయింట్ సెక్రెటరీ నాయనపల్లి అనుదీప్ జయసింహ, ట్రెజరర్ వినయ్ కుమార్, ఆనంద్‌కుమార్, ముంగి మోహన్ పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న న్యాయవాదులు

అనంతంపల్లెలో వరుస దొంగతనాలు

- భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రమైన పుల్లంపేట నడిబొడ్డున ఇటీవల జరిగిన భారీ చోరీ సంఘటన మరువకముందే మండలంలోని అనంతపల్లి గ్రామంలో వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే అనంతపల్లి గ్రామంలోని ఈరపరాజు శంకర్ రాజు ఇంట్లో గతంలో ఒకసారి చోరీ జరగగా తిరిగి రెండోసారి దొంగలు చోరీకి ప్రయత్నించారు. అనంతంపల్లె పంచాయతీలోని జానకిపురంలో పెరుమాళ్ ఇంట్లో కూడా దొంగలు చోరీకి ప్రయత్నించారు. పెరుమాళ్ శనివారం ఉదయం 11 గంటలకుఊరికి వెళ్ళగా పెరుమాళ్ కోడలు ఆదివారం రాత్రి కువైట్ కి వెళ్లాల్సి ఉండగా తమ పిల్లలను తమ బావ దగ్గర విడిచిపెట్టడానికి శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఊరికి వెళ్ళగా ఇదే అదును చూసుకొని అదే రోజు రాత్రి దొంగలు చోరీ చేశారు. తిరుమల ఇంట్లో రెండు గ్రాముల కమ్మలు, రూ.7వేలు నగదు రూపాయలు దొంగలు తీసుకెళ్లినట్లు తెలపారు. వరుసగా దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు రాత్రి సమయంలో గస్తీ నిర్వహించి దొంగతనాలు అరికట్టాలని కోరుతున్నారు. .

చెల్లా చెదరుగా పడివున్న వస్తువులను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్ ఫొటో)

గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే

పౌల్ట్రీ ఫామ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-గుర్రంకొండ

గ్రామాల్లో మౌలిక వసతులకు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని శెట్టివారిపల్లి సర్పంచ్ నారా వెంకటరమణ బొడిగుట్టలో నిర్మించిన పౌల్ట్రీ ఫామ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పథం లో దూసుకుపోతుందని అన్నారు. గ్రామాల్లో సిసిరోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య ఉన్న తన దృష్టి తీసుకొని వస్తే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జగదీష్, ఎల్లుట్ల మురళి, సుధాకర్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు అండ.. బీమా..!

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో కూలీలకు అండగా బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. క్షేత్ర స్థాయిలో బీమాపై సరైన అవగాహన లేకపోవడంతో కూలీలు ప్రమాదవశాత్తు మరణిస్తే బీమా అందుకోలేకపోతున్నారు. మండల వ్యాప్తంగా 11,057 జాబు కార్డులు ఉన్నాయి. ఇందులో 7,477 యాక్టివ్ జాబ్ కార్డులున్నాయి. వీటిలో 4,600 మంది కూలీలు పనులకు వెళుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కూలీల భద్రత కోసం రెండు రకాల బీమా సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద 18–70 సంవత్సరాలలోపు వారు అర్హులు. వీరు ఏటా రూ.20 చెల్లిస్తే ఈ పథకంలో ప్రయోజనం పొందవచ్చు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2లక్షలు కుటుంబానికి అందుతుంది. జాబ్ కార్డులో ఎంతమంది ఉంటే అంతమందికి ఈ ప్రమాద బీమా వర్తిస్తుంది. ఇంకొకటి ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన. ఇందులో సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే 18 నుంచి 50 సంవత్సరాల వయసు వారు అర్హులు. ఇందులో కేవలం ఇంటి పెద్ద మాత్రమే బీమా పొందే అవకాశం ఉంటుంది. సహజ మరణమైన, ప్రమాదవశాత్తు మరణించినా బీమా మొత్తం రూ.2 లక్షలు మరణించిన వ్యక్తి నామినీకి అందజేస్తారు.

వంద శాతం అమలుకు చర్యలు..

గతంలో ఇలాంటి బీమా పథకాలు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఈ ఏడాది వంద శాతం నమోదు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కూలీలు దరఖాస్తును ఆయా గ్రామాల పరిధిలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌కు అందజేయాలి. వారు వాటిని బ్యాంకులో సమర్పించి ఆన్‌లైన్ చేస్తారు. మే నెలలో బీమా వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

- కృష్ణమూర్తి, ఎంపిడిఒ, సింహాద్రిపురం

అవగాహన లేక నష్టపోయిన కూలీ కుటుంబం..

మండలంలోని గురజాలలో ఇటీవల ఉపాధి హామీ పనులకు వెళ్లిన బోరెడ్డి ఓబుల్‌రెడ్డి వడదెబ్బతో పనిచేస్తున్న ప్రదేశంలోనే మృతి చెందాడు. బీమాపై సరైన అవగాహన లేకపోవడంతో బీమాకు సంబంధించిన ప్రీమియం చెల్లించలేదు. ఈ కారణంగా బీమా ఆ కుటుంబానికి వర్తించలేదు.

బీమాపై పూర్తిగా అవగాహన కల్పించాలి..

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీలకు సరైన అవగాహన లేక బీమా సౌకర్యాన్ని పొందలేకపోతున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది కూలీలకు అవగాహన కల్పించి బీమా చేసేలా చర్యలు తీసుకోవాలి.

- శివశంకర్ రెడ్డి, ఉపాధి కూలీ, సింహాద్రిపురం

బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

మండలంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలు బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బీమాపై కూలీలకు వివరించాం. బీమా చేయడం వల్ల వారి కుటుంబానికి ఎంతో భరోసా ఉంటుంది. ప్రతికూలీ బీమా చేసుకోవాలి.

- జయభారతి, ఎపిఒ, సింహాద్రిపురం

ఆదర్శ కమ్యూనిస్టు యోధుడు 'పొన్నతోట'

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఆదర్శ కమ్యూనిటీ యోధుడు పొన్నతోట వెంకటరెడ్డి అని మాజీ జడ్‌పిటిసి సభ్యులు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అంకాలమ్మ గూడూరులో పొన్నతోట వెంకటరెడ్డి వర్ధంతి వేడుకలను పొన్నతోట స్థూపం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎందరో అతిరథ మహారథులను జాతికందించిన సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరు గ్రామంలో జన్మించిన నిస్వార్థ ప్రజా సేవకుడు వెంకట్ రెడ్డి అన్నారు. తెల్ల దొరల కాలంలోనే ఉపాధ్యాయ, చేనేత కార్మిక, రైతు, రైతు కూలీ, మహిళ, బండ్ల కార్మిక తదితర సంఘాలను నిర్మించారన్నారు. అప్పటి రైతు సమస్యల పరిష్కారానికి కృష్ణ, తుంగభద్ర జలాల కోసం మొదట కరపత్రం వేయడమేకాక ప్రజా ఆందోళన నిర్వహించిన గొప్ప వ్యక్తి అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి బాల బయన్న ఆధ్వర్యంలో మ్యాజిక్ షో నిర్వహించారు. జాతీయ ఉత్తమ అవార్డు గ్రహీత పొన్నతోట గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించారు. కార్యక్రమంలో అంకాలమ్మ గుడి దేవస్థానం చైర్మన్ సోమ కొండారెడ్డి, నక్కలపల్లి కొండారెడ్డి, రమణ, పోస్టు శివుడు, కందుకూరు సోమిరెడ్డి, కెవి రవి, అశోక్, రామ్మోహన్, ప్రసాద్, అజయ్, సరళ, రఘు, పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొని నివాళులర్పించారు.

మాట్లాడుతున్న మాజీ జడ్‌పిటిసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

శిల్పను సన్మానిస్తున్న ఎంపిపి, ఎంపిడిఒ

విద్యార్థినికి ఎంపిపి అభినందనలు

ప్రజాశక్తి-వీరబల్లి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మి కుమార్తె శిల్ప ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో బైపిసిలో 440 మార్కులకు గాను 436 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా శిల్పను ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపిడిఒ నూర్జహాన్ అభినందించారు. విద్యార్థిని శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి శివరాంగౌడ్ పాల్గొన్నారు.

మైనార్టీలకు సబ్సిడీ రుణాలు: ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనార్టీలకు స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలను ప్రభుత్వం అందిస్తోందని ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలను అందిస్తోందని పేర్కొన్నారు. ముస్లిములకు రూ.లక్ష నుంచి రూ.8 లక్షల వరకు క్రిస్టియన్లకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పించిందని అన్నారు. ఎంపికైన వారికి 50 శాతం సబ్సిడీతో రుణం మంజూరు చేస్తుందన్నారు. అర్హత కలిగిన వారు ఎపిఒబిఎంఎంఎస్. ఎపిసిఎఫ్ఎస్ఎస్ వెబ్ సైట్‌లో ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన మైనార్టీ, క్రిస్టియన్ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.


గంగమ్మ సన్నిధిలో ఆలయ ధర్మకర్త, నిర్వాహకులు

వైభవంగా గంగమ్మ జాతర

ప్రజాశక్తి-పీలేరు

మండలంలోని తలుపుల పంచాయితీలో ఉలవల గంగమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారికి జరిగే మూడు రోజుల జాతర కార్యక్రమాలకు ఆదివారం శ్రీకరం పలికినట్లు ఆలయ ధర్మకర్త, కార్య నిర్వాహకులు జె. వెంకటరమణనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించే కార్యక్రమాలతో జాతర మొదలైందని అన్నారు. జాతర ప్రారంభం రోజు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారని చెప్పారు. రాత్రి ఆలయం వద్ద జరిగే కార్యక్రమాలలో పాల్గొనే ప్రజలకు సౌకర్యంగా భక్త చింతామణి నాటక ప్రదర్శనతో పాటు బాల నాగమ్మ నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం చెప్పారు. ఆలయ అర్చకులు గణేష్‌రాజు అమ్మవారికి విశేష అలంకరణ, పూజలు చేసి భక్తులకు తీర్థ, ప్రసాదాలు విచరణ చేశారు. కార్యక్రమాల్లో ఆలయ నిర్వహకులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న రూపానందరెడ్డి, వరలక్ష్మీ

పేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని నక్కలపల్లి పంచాయతీలో గ్రామ సర్పంచ్ చంద్రమోహన్ అధ్యక్షతన కుడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి, ఆయన సతీమణి వరలక్ష్మి ,కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. రూపానందరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాలయం ఆవరణంలో ఆదివారం సాయంకాలం భారీ కేక కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం ముక్కారూపానంద రెడ్డి, వరలక్ష్మి చేతుల మీదుగా గ్రామంలోని గిరిజనులకు, నిరుపేదలకు చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా నామీద చూపుతున్న ఆధార అభిమానాలు ఎప్పటికీ మరువలేనని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నియోజకవర్గ ప్రజలకు సేవలందించడంలో రుణపడి ఉంటానని అన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రామానుజుల నాయుడు, జయప్రకాష్ ,సాయి వికాస్ రెడ్డి ,కట్ట గిరి, నరసింహనాయుడు, రాజు కుంట సర్పంచ్ గుత్తి నరసింహ, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఏదోటి రాజశేఖర్నాయుడు, గూడూరు నాగరాజు, స్కూల్ చైర్మన్ శంకర్ రాజు, అనంతయ్య యాదవ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

బోదేషావలికి శ్రామిక శక్తి అవార్డు

ప్రజాశక్తి-పీలేరు : బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ బోదేషావలి శ్రామిక శక్తి అవార్డు అందుకున్నారు. తిరుపతి యూత్ హాస్టల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఇఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అవార్డు గ్రహీత బోదేషావలీ మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులను అన్ని విధాల ఆదుకోవాలని విజ్ఞప్తి చేసుకున్నారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం తమ పోరాటాన్ని కొనసా గిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు రత్నకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీధర్, యూనియన్ జనరల్ సెక్రటరీ మూర్తి, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - వేంపల్లె : రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు బాధ్యతగా వ్యవ హరించాలని సిఐ నర్సింహులు అన్నారు. ఆదివారం సాయంత్రం సిఐ నర్సిం హులు వాహనాలను తనిఖీ చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా దుకా ణాల ముందు వాహనాలను పార్కింగ్ చేయాలని కోరారు. దుకాణాల యాజ మానులకు పలు సూచనలు ఇచ్చారు. పబ్లిక్ స్థలాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని సిఐ హెచ్చరించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు చెప్పారు. పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాలు జరగకుండా నివారించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్ పాల్గొన్నారు.

రాయితీతో జిప్సం మంజూరు

ప్రజాశక్తి - చక్రాయపేట: ఖరీఫ్ సాగు కోసం ముందుచూపుతో రైతులకు రాయితీతో జిప్సం అందుబాటులో ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ నవ్వంత బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు ఆయా రైతు సేవా కేంద్ర సహాయకులను సంప్రదించాలన్నారు. రాయితీ వేరుశెనగ విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.

అగ్నిప్రమాదంతో కాలిపోయిన పరికరాలు

కంప్యూటర్స్ దుకాణంలో అగ్ని ప్రమాదం

-రూ.15 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని కదిరి రోడ్డు, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం ఎదురుగా వున్న ఎఎం కంప్యూటర్స్ షాపులో శనివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగి సుమారు రూ. 15 లక్షల ఆస్థి నష్టం జరిగినట్లు షాప్ యజమాని ముస్తాక్ హుసేన్ తెలిపారు. షార్ట్ సర్క్యూట్ వలనో లేక మరే ఇతర కారణాల వల్లో షాపులో మంటలు చెలరేగి కంప్యూటర్ పరికరాలన్నీ అగ్నిలో కాలిపో యాయిని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులు గుర్తించి తనకు, అగ్నిమాపక సిబ్బం దికి సమాచారమిచ్చారని, అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేసినప్పటికీ జరగాల్సిన నష్టం జరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో గత 13 ఏళ్లుగా ఏయం కంప్యూటర్ దుకాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అగ్ని ప్రమా దంతో సర్వసం కోల్పోయి రోడ్డున పడ్డామని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకు లోను ద్వారా ఫైనాన్స్ సంస్థ లు నుంచి రుణాలు తీసుకుని కొనసాగిస్తూ, వచ్చే ఆదాయంతో అప్పులు తీర్చుకుంటున్న సమయంలో ఇలా జరగడంతో దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయానని వాపోయారు. ప్రభుత్వం, పాలకులు తమకు జరిగిన నష్టాన్ని గుర్తించి, ఆదుకోవాలని కోరారు.

విరబూసిన అడవి జాజిపూలు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో వ్యాపించి ఉన్న పాల కొండలో మే మొదటి వారంలో తొలకరి వర్షాలు కురియడంతో అడవి జాజి పూలు విరగబూ శాయి. వర్షాకాలానికి ముందు కురిసే తొలకరి వర్షనికి అడవి జాజి పూలుపూస్తూ ఉంటాయి. గువ్వల చెరువు ఘాట్ రోడ్లు ప్రయాణించే ప్రయాణికుల చూపరులను అలరిస్తూ పాల కొండల అందాలు దర్శనమిస్తున్నాయి.

పాలకొండలో విరబూసిన అడవి జాజిపూలు

క్రైం కార్నర్

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణం సమీపంలో కస్తూర్బా స్కూల్ సమీపంలోని రైతు డి.వెంకటా చలపతికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండ గులు ధ్వంసం చేసి రాగి తీగలను తీసుకె ళ్లారు. ఆదివారం ఉదయం వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్లు గుర్తించి విద్యుత్ శాఖ అధికారులకు రైతు ఫిర్యాదు చేశారు. గత నెల కాలం నుంచి ఇప్పటి వరకు చుట్టుప్రక్కల మూడు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయని రైతులు తెలిపారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో మరోవైపు ట్రాన్స్‌ఫార్మర్లు, డ్రిప్ పైపులు తరచూ చోరీలకు గురవుతుండడంతో రైతులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు ట్రాన్స్‌పార్మర్ చోరీలపై నిఘా ఉంచాలని రైతులు కోరుతున్నారు.

చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ చూపుతున్న రైతు

స్కూటీ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల కేంద్రంలోని కడప–రేణిగుంట జాతీయ రహదారిపై సీతారాంపేట సమీపంలోని పుల్లంగేరు బ్రిడ్జిపై ఆదివారం స్కూటీ ఢీకొనడంతో లగిడి పెంచలరాజు అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలలోకి వెళ్తే అప్పయ్యరాజుపేట గ్రామానికి చెందిన పెంచలరాజు కూలి పని చేస్తూ జీవనం సాగించేవాడు. కూలి పని చేయడం కోసం నడుచుకుంటూ వెళుతుండగా స్కూ టీ మీద వెళ్తున్న ఒక యువకుడు పెంచల రాజును ఢీ కొట్టి పట్టించు కోకుండా వెళ్లిపోయాడు. వెంటనే స్థానికులు పెంచలరాజును 108 కు ద్వారా రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తాళ లేక ఓ యువకుడు విషం తాగి ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..మండలంలోని వేంపల్లి పంచాయతీ, జంగాలపల్లి కు చెందిన రైతు చిన్న రెడ్డప్ప కొడుకు శ్రీకాంత్ (26) లోన్ యాప్ ద్వారా కొంత అప్పు తీసుకుని సకాలంలో చెల్లించలేక పోయాడు. లోన్ యాప్ నిర్వాహకులు వేధింపులు అధికమయ్యాయి. కుటుం బీకులకు లోన్ తీసుకున్న విషయం తెలిసిపోయేలా చేసి మరీ బాధించడంతో తీవ్ర మనస్థాపానికి గురైయ్యాడు. జీవితం పై విరక్తి చెంది గ్రామ సమీపం లోని తన పూల తోట వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు గమనించి యువకున్ని హుటాహుటిన మదనపల్లి ప్రభుత్వా సుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు.ఘటనపై తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-కలకడ : రోడ్డు ప్రమాదంలో సచివాలయం ఉద్యోగి మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నడిమి చర్ల పంచాయతీ నడిమిచర్లకు చెందిన మురాసవల్లి కుమారుడు రెడ్డిఖాదర్బాషా(28) శనివారం సాయంత్రం తన విధులు ముగించుకుని తన సొంత పనులపై మహా ల్‌కు వెళ్లి తిరిగి వస్తూ స్థానిక ఎంఆర్ఎఫ్ హోటల్ సమీపం వద్ద చిత్తూరు కర్నూ లు జాతీయ రహదారిపై తాను ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనంతో ముం దు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వెటర్నరీ అసి స్టెంట్ రెడ్డి ఖాదర్‌బాషాకు తలకు బలమైన రక్త గాయం కావడంతో వేలూరు సిఎంసికి తరలించినట్లు తెలిపారు. అక్కడ వారు వైద్యశాలను చేర్చు కోకపో వడంతో ఆదివారం స్థానిక మహల్ క్రాస్ వద్ద ఉన్న ప్రయివేట్ వైద్యశా లలో చేర్పించడంతో ఆదివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎఎస్ఐ శంకర్‌నాయక్ తెలిపారు. కేసునమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

రెండు కార్లు ఢీ

-మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుటుంబ సభ్యులకు గాయాలు

ప్రజాశక్తి-ములకలచెరువు : ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో పలువురికి గాయాలైన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు. ములకలచెరువు చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ మోయిన్‌బాషా సొంత పనిలో నిమిత్తం కుటుంబ సభ్యులతో మదనపల్లికి వెళ్ళాడు. అక్కడ పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా పెద్దపాళ్యం బ్రిడ్జి సమీపంలో కదిరి నుంచి మదనపల్లి వైపు వెళ్తున్న కారు ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో మోయిన్‌బాషా కుటుంబ సభ్యులు గాయపడ్డారు. గాయపడిన వారిని మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు.